## ఉదయం వచ్చిన ఉత్తరం కామాక్షి మనసులోకి విష్ఫారవ్వమ విసిరింది.

కామాక్షి కాలుకాలిన పిల్లిలా ఊరంతా తిరగసాగింది. సాయంత్రానికల్లా తిరుపతి చేరాలి. పన్నెండు రూపాయలు బస్సు చార్జీ. కాని చేతిలో పైసా లేదు. తన గోడంతా వెళ్ళబోసుకుని ఊళ్ళో ఎవళ్ళనడిగినా నోరారా సానుభూతి తప్ప ఒక్క రూపాయి పుట్టలేదు.

చివరికి వాడుకుంటూన్న ఇత్తడి బిందెను పట్టుకుపోయి టైలర్ భార్య బూబమ్మ దగ్గర తాకట్టు పెట్టి రూపాయికి పదిపైసలు వడ్డీకి పాతిక రూపాయలు సంపాయించేటప్పటికి గంట నాలుగయింది.

"ఇల్లు జాగర్త. పొద్దునా. సాయంకాలం. పెంటలాదేవోయి గుళ్ళో దీపం పెట్టిరా. రాత్రికి తోడుకు పక్కింటితాయారమ్మత్తను రమ్మన్నాను, వస్తుంది. భయపడకుండా పడుకో. మామకు ఎట్లావుందో చూసుకుని రేపు పొద్దు గూకేకల్లా వచ్చేస్తాను." అని కూతురు సునీతకు మరీమరీ చెప్పి పట్నం బయలుదేరింది కామాక్షి.

ఆ ఊరి నుంచి తూర్పుగా పొలంగట్ల మీదపడి మూడుమైళ్ళు తూర్పుగా నడిస్తే పట్నం వెళ్ళే మైన్‌రోడ్ వస్తుంది. అక్కణ్ణించి ఆరుగంటలకి లాస్ట్ బస్. దాన్ని పట్టుకుంటే రాత్రి పదికల్లా తిరుపతి చేరొచ్చు.

కామాక్షి మైన్‌రోడ్ చేరగానే పట్నం బస్సు వచ్చింది. బస్సు నిండా జనం కిటకిటలాడుతున్నారు. ఎలాగో జొరబడి ఊపిరాడకుండా వున్నా జనంమధ్య నిలబడింది.

కామాక్షికి తమ్ముడు భాస్కర్, కూతురు సుజాత ఇద్దరే ఈ లోకంలో నాఅనేవాళ్ళు. పదిహేనేళ్ళ క్రితం పెనిమిటిని పోగొట్టుకుని చంటిబిడ్డతో పుట్టింటికివచ్చిన కామాక్షి చేతికి పదేళ్ళతమ్ముని పట్టిచ్చి కళ్లుమూసింది తల్లి రాజమ్మ. ఆ క్షణం నుంచి ఆ రెండు పిట్టల్నీ తనే తల్లి పక్షిగా కాపాడుకుంటూ వస్తోందామె.

ఈ ముప్పై అయిదేళ్ళ జీవితాటవిలో కామాక్షిని వేధించిన ఎండా, వానా, గాలి దుమారం ఒకటీ రెండూ కావు.

ఇప్పుడిప్పుడేతమ్ముడికి రెక్కలొచ్చాయి. ఆరెన్నెల్ల కిందటే పట్నంలో ఏదో ఫేక్టరీలో మెకానిక్‌గా చేరాడు. కూతురు సుజాత ఎదిగొచ్చింది. రేపో మాపో పెద్దమనిషి కాబోతోంది. దాన్నొక అయ్యచేతిలో పెట్టాలి. తమ్ముడు భాస్కర్‌ను ఒక ఇంటి వాణ్ని చెయ్యాలి. ఈ రెండూ చేస్తేచాలు. జన్మ సాఫల్యమైనట్టు సంబరపడిపోగలదు కామాక్షి.

ఆమె తమ్ముడు భాస్కర్ పనిచేసే చోట ఏదో యాక్సిడెంట్‌లో గాయపడ్డాడట. ఉత్తరం మోసుకొచ్చిన ఆ వార్త విని నిలవలేక బయలుదేరింది కామాక్షి. అదే ఈ బస్సు పయనం.

తిరుపతి బస్‌స్టాండ్ నుంచి నడుచుకుంటూ వెళ్ళి బాలాజీభవన్ పక్కసందులో వున్న తమ్ముడి గదికి చేరింది కామాక్షి. భాస్కర్ మంచంమీద పడుకుని వున్నాడు. వాడితోపాటు పనిచేసే వనమాల శంకరయ్య పక్కనేకూర్చుని ఏదో మాట్లాడుతున్నాడు.

"మంచికాలం కామాక్షమ్మా. వెంట్రుకవాసలో అపాయం తప్పిపోయింది. అంతా ఆ ఏడుకొండలవాడిదయ" అని ప్రమాదం జరిగిన సంగతంతా వివరంగా చెప్పాడు శంకరయ్య.




చేతులకీ ముఖానికీ తగిలిన గాయాలేమో కొద్దిగా మానాయి. కాని భాస్కర్‌లో లేచి నిలబడ్డానికి కూడా శక్తిలేదు. నిలబడి నాలు గడుగులు నడవడానికి మరి రెండు రోజులు పట్టాయి. ఆ రెండు రోజులూ అక్కడే వుండి, కామాక్షి మూడోరోజు పొద్దున తమ్ముణ్ణి తీసుకుని ఊరికి బయలుదేరింది.

ముందర రచ్చబండవద్ద జనం గుమిగూడి వున్నారు. ఏదో పంచాయతీ జరుగుతోంది కాబోలు అనుకుంటూ ఇల్లు చేరింది కామాక్షి.

మంచం వాల్చి తమ్ముణ్ణి పడుకోమని చెప్పి, కాళ్ళు చేతులు కడుక్కొని, గ్లాసెడు నీళ్ళు తాగి సుజాత ఎక్కడ పోయిందా అనుకుంటూ పీట వేసుకుని నడుం వాల్చింది కామాక్షి. వెంటనే గ్రామ తలారి గోవిందయ్య వచ్చి, "పంచాయితీ చేరిందండి. మునిసిబుగోరు మిమ్మల్ని పిలుచుకు రమ్మన్నారండి" అన్నాడు.

"నన్నెందుకు రమ్మన్నారయ్యా!" అని అడిగింది కామాక్షి జంకుతూ.

"తెలవదమ్మగోరూ .... పిలుచుకు రమ్మన్నారండి. అంతే!" అన్నాడు గోవిందయ్య.

కామాక్షి వెన్నుపాములో భయం పాకసాగింది!

"నువ్వుండక్కా....విషయం ఏమిటో నే వెళ్ళి కనుక్కొని వస్తాను" అంటూ భాస్కర్ బయలు దేరాడు.

భాస్కర్ రావడం దూరం నుంచే చూశాడు మున్సబు పెంచల వాయుడు. "కామాక్షిని పిలుచుకు రమ్మంటే వీణ్ణి తీసుకొస్తున్నావేంరా గాడిదా? ఎప్పుడో ఊరొదిలివెళ్ళిన వీడికి గ్రామపంచాయతీ వ్యవహారాలకు సంబంధం ఏమిటి?" అని కేకలువేస్తూ, భాస్కర్ సమీపించాక "నువ్వెళ్ళి నీ అక్కని రమ్మను" అని పురమాయించాడు.

భాస్కర్ గబగబా ఇంటికి తిరిగివచ్చి అక్కను వెంటబెట్టుకుని రచ్చబండ వద్దకు వెళ్ళాడు.

"నువ్వు మూడురోజులు ఊరొదిలి వెళ్తే అమ్మవారి గుళ్ళో ఎవరు దీపంపెడతారనుకున్నావు? అసలే ఊరు ముదనష్టంగా వుంది. ఏదో సచ్చిన ముసల్దాని మొహం చూసి అయ్యో అంటే ఇదా నువు చేసేపని?



# లాస్ట్ బస్

అంగేరి బాలసుబ్రహ్మణ్యం

గుడిసొత్తు బాగాతిని కళ్ళు నెత్తికెక్కినట్లున్నాయి." వేసవి మేఘంలా ఉరిమాడు మున్సబు నాయుడు.

"మా తమ్ముడు చావుబతుకుల్లో వున్నాడని కాగితంవస్తే చూడ్డానికి వెళ్ళాను బాబయ్యా! గుళ్ళో దీవం పెట్టమని మా అమ్మాయికి చెప్పాను గదండీ" అన్నది కామాక్షి భయం భయంగా.

"ఆఁ బాగా చెప్పి పోయావులే. నువ్వు అటుపోగానే ఇటు నీ కూతురు గుడిసెలో దూకుంది. ఇంకేం పెడుతుంది గుళ్ళో దీవం? ఒంట్లో భయం లేకపోతే ఇలాగే జరుగుద్ది. అయినా నీ బోడి సంజాయిషీ వింటూ గ్రామం ఊరుకోదు. మారు మాట్లాడకుండా గుడి బీగాలు తెచ్చి అప్పగించు. ఈ క్షణం నుంచి నీకూ, అమ్మోరి గుడికీ ఎటువంటి సంబంధమూ లేదు" అన్నాడు మున్సబు తీర్మానంగా.

కామాక్షి నెత్తి మీద పిడుగు పడ్డట్టయింది. కొండగా నమ్ముకున్న జీవనాధారం బెండయిపోయే సరికి నిలబడలేకపోయింది. ఊళ్ళో మున్సబు మాటకు తిరుగులేదన్న విషయం ఆమెకు బాగా తెలుసు.

యేటా తిరునాళ్ళప్పుడు అమ్మవారి గుడి ముందు జరిగే వీధి భాగోతం కామాక్షి కళ్ళ ముందు ఒక్కసారి కదిలింది. దుర్యోధనుడి దుర్మార్గానికి తమ్ముడు వికర్ణుడు అడ్డు చెప్పాడు. కాని ఇవాళ ఈ ఊరి పంచాయితీలో ఆ ఒక్కడు కూడా కరువయ్యాడు. అదొక్కటే తేడా!

ఇక చేసేది లేక బొడ్లో దోపుకునివున్న గుడితాళం చెవులు తీసి రచ్చ బండ మీద వుంచి కన్నీళ్ళతో మౌనంగా ఇంటికి తిరిగి వచ్చింది.

రాత్రంతా విషాదం చీకటి బండలా ఆ అక్కా తమ్ముళ్ళ మనసులమీద కూర్చుని వాళ్ళను అటూ ఇటూ కదలనీయకుండా చేసింది.

తెల్లవారి బారెడు పొద్దెక్కాక చెరువు గట్టు దగ్గర భాస్కర్‌కు, నోట్లో వేపపుల్లతో ఎదురయ్యాడు నాగరాజు. ఎం ఏ. గోల్డ్ మెడల్‌తో పాసయినప్పటికీ ఉద్యోగం రాక పోయేసరికి. చదువుకు హరించుకుపోగా మిగిలిన నాలుగెకరాల పొలంతో బతుకును నెట్టుకొస్తున్న నాగరాజు భాస్కర్‌కి బాల్య స్నేహితుడు.

"ఇదంతా జరుగుతుందని ముందే వూహించి నేను అప్పుడే మొత్తుకున్నాను. విన్నావు కావు." అన్నాడు నాగరాజు వలకరింపుగా.

భాస్కర్ ఏమీ మాట్లాడలేదు. నాగరాజు కేసి ప్రశ్నార్థకంగా చూశాడు.


"నువ్వు చేసింది తప్పనను. అయినా పరిస్థితులకు కాస్తసర్దుకు పోవాలి కదా. మీ ఇల్లు ఊరికి మధ్యగా వుంది. ఇంటికానుకుని విశాలమైన అరుగూ వుంది. ఆఅరుగుమీద కూర్చుని నలుగురూ కాస్సేపు కాలక్షేపానికి పేకాడుకుంటారు. అయినా ఇన్నాళ్ళూదాన్ని పెద్దగా పట్టించుకోని నువ్వు పోయిన నెల వచ్చినప్పుడు అరుగుమీన తడిక అడ్డం కట్టావు. "ఎందుకూ?" అంటే "సుజాత వయసుకు రాబోతోంది, కాస్త మరుగూ మట్టూ వుండాలి కదా?" అన్నావు. ఆ రోజు నుంచీ సమయం కోసం ఎదురుచూస్తున్న పెద్దలకు మంచి సాకే దొరికింది. ఇప్పుడు మీ అక్క బతుకు ఏమయిందో చూడు." అన్నాడు నాగరాజు ఎంతో సాను భూతి కనబరుస్తూ.

భాస్కర్ ఏమీ మాట్లాడకుండా ఇంకా మౌనంగా వుండేసరికి మళ్ళీ నాగరాజే "మరి నువ్వయినా చెప్పొచ్చుకదా అంటా వేమో? అక్కడ పేకాడేవాళ్ళంతా ఈ ఊరి పెద్దమనుషులే అయ్యారు. నేను వాళ్ళనెలా అడగ్గలను చెప్పు?" అన్నాడు సంజాయిషీ చెప్పుకునే ధోరణిలో.

"ఔను, నిజమే. మా ఇల్లు ఒక్కటే ఈ వూరికి మధ్యగ వుంది. మా ఇంటికి ఎదురుగుండా వున్న మీ ఇంటి ముందు వున్న సిమెంటు అరుగు ఏమయిపోయింది? అదిపోనీ. నువ్వు చెప్పావే 'పెద్దమనుషులు' ఆ పెద్దమనుషుల ఇళ్ళ అరుగులన్నీ ఖాళీ గానే వున్నాయే! కాలక్షేపం చెయ్యడానికి అవన్నీ పనికిరావు. ఈ వూరి పెద్దమనుషులు పేకాడ్డానికి మా అరుగు ఒక్కటే కావాలసొచ్చిందన్నమాట! సరిసరి........ అదంతా ఇప్పుడెందుగ్గానీ .... మా ఇల్లు అమ్మేస్తున్నాము. అందలేనిఊళ్ళోవుండడం తప్పు. ఎవడికో అమ్మడం దేనికి? ఎదురింటివాడివి; మాకు చాలా కావలసిన వాడివి. నువ్వే కొనుక్కో. వీలయినప్పుడు డబ్బు కడుదువుగాని" అనిచెప్పి భాస్కర్ అక్కణ్ణించి చరచరా వచ్చేశాడు.

ఆ రోజు సాయంకాలమే-కొండగాలీ. ఏటినీళ్ళు. సమృద్ధిగా లభించే సొంత ఊరి నుంచి నీళ్ళకూ. గాలికీ కరువైపోయిన పట్నంలోని మురికివాడకు మరో కుటుంబాన్ని చేరవేసింది ఆరుగంటల లాస్ట్‌బస్.

*




మినీకథ




# షాక్ ట్రీట్‌మెంట్

'విహంగ'

"ఏజెంట్ ఎయిటీ ఎయిట్! గూఢచారి గుండూరావ్ నీకు తెలుసుగా"! అన్నాడు బాస్.

"తెలుసు. ఏమైంది గుండుగాడికి" అడిగాడు 88.

"మన సైంటిస్ట్ సన్నాసిరావ్‌ని శత్రువులుఅపహరించే ప్రయత్నంలో వున్నారని. గూఢచారి గుండూరావ్‌ని సన్నాసిరావ్‌కి కావలాగా వుంచాము. కాని శత్రువులొచ్చి. సన్నాసిరావ్‌ని ఎత్తుకెళ్ళి పోయారు. పోతూ. పోతూమన గూఢచారి గుండూరావ్ గుండు పగలకొట్టారు. తత్ఫలితంగా గుండూరావ్ అన్నీ మర్చిపోయాడు. అతనొక్కడే చెప్ప గలడు సన్నాసిరావుని ఎవరెత్తుకెళ్ళింది. అతడ్నినయం చేయడానికి విశ్వప్రయత్నం చేశారు డాక్టర్లు. ఒక్కటీ సక్సెస్ కాలేదు. నువ్వెలాగైనా గుండూరావ్‌నుంచి నిజాన్ని రాబట్టాలి. సమర్థుడివని నీకప్పగించాం" చెప్పాడు బాస్.

ఏజెంట్ ఎనుబది ఎనిమిది చాలా సీరియస్‌గా ఆలోచించి ఒకనిర్ణయానికొచ్చాడు.

మరుసటిరోజు గుండూరావ్ వున్న హాస్పిటల్‌కెళ్ళాడు ఏజెంట్ 88.

ముగ్గురు వార్డ్‌బాయ్‌లని పిల్చి. డాక్టర్ దేవిడ్‌ని గట్టిగాపట్టుకున్నాడు ఏజంట్ 88.

డాక్టర్ దేవిడ్ "హెల్ప్. హెల్ప్! ఏజెంట్ గుండూరావ్‌గారూ. కాపాడండి. శత్రు దేశస్థుల బారినుండి నన్ను కాపాడండి" అని అరవసాగాడు.

వార్డ్ బాయ్‌లు వికటాట్టహాసం చేశారు. గూఢచారి గుండూరావ్ పక్కమీది నుంచి లేచాడు.

పెద్దగా నవ్వుతూ ఏజెంట్ 88 "గుండూరావ్‌కి పాతవన్నీ జ్ఞప్తి కొస్తున్నాయి" అంటూ ఒక ఇనుపరాడ్‌తో గుండూరావ్ మాడుమీద గట్టిగా కొట్టాడు.

ఒకే ఒక్క దెబ్బతో గుండూరావ్‌కి కపాలమోక్షం! పుర్రె పగిలి. తెల్లని మెదడు బయటకొచ్చింది.

నెత్తీ.నోరూ బాదుకున్నాడు బాస్-వున్న ఒక్క ఆధారం పోయినందుకు.

"ఎలా జరిగిందిది?" అరిచాడు బాస్.

ఆ తర్వాత తెలిసింది— అంతకు ముందు రోజు ఏజెంట్ 88 తెలుగుసినిమా చూశాడని!

●